# నాకు నచ్చిన కథ - "ఇదీ స్నేహమే"

**వి. నాగరత్న**

మనిషి మనుగడ వున్నంతవరకూ కథలు పుడుతూనే వుంటాయి. ఈ థీమ్‌మీద ఇంతకు ముందు కథలొచ్చాయి, ఇంకేం రాస్తారు అనుకోవడం పొరపాటు. విషయం ఒకటే కావచ్చు కానీ దానికి అసంఖ్యాకమయిన కోణాలుంటాయి, కథ చెప్పే పద్ధతులు అనేకానేకం వుంటాయి. కనుక రచయితలో సత్తా వుంటే ఏ అంశాన్నయినా అపురూపమయిన కథగా మలచగలడు.

అయితే మామూలు మనుషుల్లో మహాత్ముల్లా కథల్లో ఆణిముత్యాలు అరుదుగా వుంటాయి. అటువంటి అరుదయిన కథ శ్రీకాకాని చక్రపాణి గారు రచించిన "ఇదీ స్నేహమే" పూసలన్నీ మంచి ముత్యాలు కావు వాటికి కొన్ని ప్రత్యేక గుణగణాలుంటాయి అలాగే ఉత్తమ కథకీ లక్షణాలు వున్నాయి.

అందులో కథ ఆద్యంతం ఆసక్తితో చదివించడం ప్రథమ, ప్రధాన లక్షణం. రెండోది కథ సమాజానికి ఏదో విధంగా మేలు చేసేదేగానీ కీడు చేసేదిగా వుండకూడదు. అంటే తిరోగమనానికి తావిచ్చే భావాలని నాటరాదు. కథ చదివిన పాఠకుడు ఒక మంచి పని చేయడానికి ప్రేరేపితుడు కావాలి. కథలో ఉపదేశం అంతర్లీనంగా వుండాలే తప్ప ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఒక నీతి కథలా కనిపించకూడదు. ఎందుకంటే కళల పరమ ప్రయోజనం ఆనందం. దాని తర్వాతే మరేదయినా, అయితే ఆ ఆనందం ఏ స్థాయిలో వున్నది అనేదాన్ని బట్టి కథని అంచనవేస్తారు.

కొన్ని కథలు చివరివరకూ చక్కగాసాగి చివర్లో అర్థాంతరంగా ఆగిపోవడమో, లేదా కళావిహీనంగా అంతరించడమో చూస్తుంటాం. కానీ మంచి కథకి ముగింపు కూడా ముఖ్యమే. ముగింపులో ఒక చమక్కు వుండాలి. ఒక కన్నీటి చుక్కనో ఒక హసనరేఖనూ తెప్పించగలిగేదే గొప్ప ముగింప నిపిస్తుంది.

ఈ లక్షణాలన్నీ వున్నాయి గనుకనే "ఇదీ స్నేహమే" మంచి కథగా రూపుదాల్చింది. ఈ కథలో తీసుకున్న అంశం రెండు విభిన్న (కమ్మ, బ్రాహ్మణ) కులానికి చెందిన వ్యక్తుల మధ్య రగిలిన అంతర్యుద్ధం. కులాల నేపథ్యంలో అసంఖ్యాకమయిన కథలొచ్చినా దీని ప్రత్యేకత దీనిదే. ఎలాంటి సందర్భంలోనూ మనసులోని మాటని బయటపెట్టని ఒక గంభీరుని, అందుకు పూర్తి భిన్నమయిన ఒక ఆవేశపరుని ముఖ్య పాత్రలుగా తీసుకుని రక్తికట్టించేట్లు కథ నడుపుతారు రచయిత.

కులాల పట్టింపుని మాత్రం తీసుకుని ఎటువంటి హితోక్తులూ, నీతిసూత్రాలూ లేకుండా పాఠకుడు పాత్రలో పాత్ర అయి, కథలో లీనమై చదివేంత అద్భుతంగా, సమర్థవంతంగా సాగిందీ కథ.

కులాల మధ్య చెలరేగే విభేదాలని, మానవ మనస్తత్వ లక్షణాలని కలబోసి, కలనేసి, రసవత్తరమయిన రచనా సంవిధానపు రంగులో ముంచి తీసి, ఆయా సందర్భాలలో, సన్నివేశాలలో మనిషి సహజపోకడలని కళాత్మకమయిన డిజైన్లుగా తీర్చిదిద్ది అమూల్యమయిన కథా వస్త్రాన్ని సృష్టించి కళామతల్లికి సమర్పించారు రచయిత.

వ్యక్తుల అంతరంగాలని అద్దంలో చూసినట్లు రాయడం శ్రీ కాకాని చక్రపాణిగారికే సాధ్యం. రాసికంటే వాసి ముఖ్యమని నమ్మి ఆచరించే శ్రీచక్రపాణిగారు వృత్తిరీత్యా ఇంగ్లీష్ లెక్చరర్. మాస్టర్‌గారు నాకు గురువు కావడం, నా అదృష్టం అయితే, ఆయనతో కలసి కొన్ని రచనలు చేసే అవకాశం కూడా రావడం నిజంగా మహా అదృష్టం.

అసలు కథ మీరు ఎటూ చదవబోతున్నారు. కనుక క్లుప్తంగా అయినా కథ చెప్పే ప్రయత్నం చేయలేదు. ఐస్‌క్రీం ఎలా వుంటుందో ఎంత వర్ణించినా తిన్నపుడు కలిగే అనుభూతి నివ్వలేం కదా! నాకు చాలా నచ్చిన ఈ కథని మీరూ మెచ్చుతారని మనస్ఫూర్తిగా విశ్వసిస్తూ........

# ఇదీ స్నేహమే!

**కాకాని చక్రపాణి**

"మా అయ్యగారు చెప్మన్నారండీ మీకు. మీ కోళ్ళొచ్చి మా ఇంటో చిక్కుడు మొక్కల మొలకలు తినేస్తున్నాయంట. గంపలో ఆట్ని మూతెట్టమన్నారు." అన్నాడు రాములు వరండాలో పడక్కుర్చీలో నడుం వాల్చి, పేపరు చదువుతున్న వెంకట్రామయ్య చౌదరిగారితో.

దాంతో ఆయనకు వళ్ళు మండిపోయింది. "ఆయన్నే మొలకలమీద గంపేసుకోమను. కోళ్ళన్నాక ఓ చోటుంటయ్యా! మా కోళ్ళని ఎప్పుడు మానుకోవాలో మాకు తెలుసు, ఆయనేం చెప్పక్కర్లేదు" అన్నాడాయన.

రాములికి ఏం చెప్పాలో తోచక వెళ్ళిపోయాడు. "వాడికేం పొయ్యేకాలమంట. హెూటళ్ళకెళ్ళి కోడి పలావులు మెక్కొస్తారు తప్పుడు కొడుకులు! కోడొచ్చిందని గోలా!" అన్నాడు వెంకట్రామయ్య పక్కన కూర్చుని చాటలోకి బియ్యంలో రాళ్ళేరుతున్న భార్య పార్వతమ్మతో.

"చూడని సంగతి మన కెందుకండీ? మీకు ప్రతిదానికీ కోపమే. బాపనాయన గందా! ఆయన మడీ, ఆచారం పాడయిపోతన్నయ్యేమో! మీరే వెళ్ళి సర్ది చెప్పొచ్చుగా?" అంది భార్య పార్వతమ్మ.

"వీడి ఆచారం సంగతి నాకె చెప్పమాక! పెద్ద ఉద్యోగమే చేశాడట. అంత సంపాదించిన వాడు మడి కట్టుక్కూచున్నాడంటే నేన్నమ్మను. ఈ పెద్ద ఉద్యోగస్థులకి రాత్రి ఓ చుక్కేసుకోపోతే నిద్రపట్టదు. ఇవాల్టికి రిటైరై 'వృద్ధనారీ పతివ్రతా' అని పూజా పునస్కారాలు మొదలేడ్తే చేసిన పాపాలు పోతయ్యా? అన్నారాయన.

"ఇదుగో మీరు కూర్చోండి. ఆయనేం చేస్తే మనకెందనకూ?" అంటూ ఆమె చాట తీసుకుని లోపలికెళ్ళిపోయింది.

వెంకట్రామయ్యచౌదరి తాసీల్దారుగా పని చేసి రిటైరై, పది సంవత్సరాలుగా స్వంత ఊళ్ళో స్థిరపడి, హాయిగా ప్రశాంత జీవితం గడుపుతున్నాడు. ఇదుగో ఈ విశ్వనాథశాస్త్రి పక్కింట్లో మకాం పెట్టిన తరువాతే ఆయన ప్రశాంతతకు భంగం కలిగింది. శాస్త్రి ప్రవర్తన అమర్యాదకరంగా లేకపోతే వెంకట్రామయ్య ఏమీ అనేవారు కాదు. మనుషుల్ని 'వాడు-వీడు' అని అమర్యాదగా పిలిచే తత్వం కాదు ఆయనది.

తాసీల్దారుద్యోగం రాబడి కలదే కాని పై సంపాదన కతికే అలవాటు లేని వెంకట్రామయ్య పెద్దగా ఏం కూడబెట్టలేకపోయాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు. పెద్ద కూతుళ్ళిద్దరికీ బాగా కట్నమిచ్చి మంచి సంబంధాలే చేశాడు. దాంతో మిగిలిన ఆస్తి, కూడబెట్టిక డబ్బు కరిగి

పోయాయి. పెన్షన్ మీద నెట్టుకొస్తున్నాడు. ఇద్దరు పెద్ద ఆడపిల్లల తరువాతి వాడు మధు సూదనం. బి.ఇ. చివరి సంవత్సరం చదువు తున్నాడు.. శకుంతల చివరి పిల్ల. వయసు పందొమ్మిది ఏళ్ళుంటాయి. బి.ఏ.రెండో ఏడు చదువుతూంది. కూతురిపెళ్ళి గురించే వెంక ట్రామయ్య దిగులు. కొడిక్కి ఉద్యోగమొస్తే కొంప అమ్మయినా పిల్ల పెళ్ళి చేయాలను కుంటున్నారు ఆయన.

తీరిగ్గా ఉన్న ఆయన మనసు కోళ్ళ పెంపకం మీదకు పోయింది. కోళ్ళను పెంచసాగాడు. ఎప్పుడయినా కోళ్ళు గోడ దాటి పక్కింటి ఆవరణలో అడుగు పెడితే చాలు విశ్వనాథశాస్త్రి పెద్ద ప్రమాదం ముంచుకొచ్చినట్టు గోల చేయటం వెంకట్రామయ్య కేంనచ్చలేదు. ఇలా కబురు చేయటం తను ఆ ఇంట్లో దిగిన మూణ్ణెల్లల్లో ఇది అయిదోసారో, ఆరోసారో.

'పోనీ తనే వచ్చి చెప్పొచ్చుగా? అహ చెప్పడు. నౌకరు కుర్రాడి చేత కబురెడతాడు. బోడి గొప్ప! వాడి మాత్రం ఉద్యోగం తనూ వెలగబెట్టాడు. ఎవరితోనూ నోరు తెరచి మాట్లాడగా తను చూడలేదు. అసలు వాళ్ళ కులమే అంత! అనుకుని బాధపడేవాడు వెంకట్రామయ్య.

విశ్వనాథశాస్త్రి డాసన్ ఆటో మొబైల్స్‌లో పని చేసి రిటైరయ్యారు. అలా అని ఆయన ఎవరితోనూ చెప్పుకోలేదు. ఇంటి ముందు బోర్డే చెప్తుంది. వి.విశ్వనాథశాస్త్రి బి.ఇ. (రిటైర్డ్) జనరల్ మేనేజర్, డాసన్ ఆటోమొబైల్స్, కలకత్తా అని. మనిషి సన్నగా. పొడుగ్గా ఉంటాడు. పచ్చని దేహచ్ఛాయ. బట్టతల మీద మిగిలిన వెంట్రుక లు మిలమిలా వెండిలా మెరుస్తుంటాయి మనిషి ముఖం ఎప్పుడూ ముడుచుకుపోయి ఉంటుంది. ఆయన నవ్వగా ఎవరూ చూడ లేదు. ఆయన్ని గురించిన సమాచారం రాములు చెప్తేనే అందరికీ తెలిసేది.


"అయ్యగారి భార్య ఆయన ఉద్యోగం చేస్తూండగానే పోయిందంట. ఆయనకో కూతురు. అమెరికాలో ఉందట. ఆయమ్మే నాయనకు అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తుంది ' అని చెప్పేవాడు రాములు.

"వంటెవరు చేస్తార్రా!" ఆరాలు తీసేది పార్వతమ్మ.

"ఆయనే చేసుకుంటాడు. ఒంటిపూటేగా" రాత్రికి పళ్ళు పలారాలు తింటాడు."

"ఒక్క మనిషికి అంతింల్లెందుకురా?"

"ఏమోనమ్మా! ఇంకో మనిషి పొడ గిట్టదు ఆయనకు. అయ్యను చూసీ, ఈ వెంక ట్రామయ్య చౌదరి మంచివాడేనంట్రా. మొహం చూస్తే ప్రతిదానికీ తగూకి సిద్ధమయే వాడిలా ఉంటాడు అన్నాడయ్యా!"



"మనిషి తానెంతో లోకమంతా అను కుంటాడు. మీ అయ్యను చూసినా నా కలాగె అనిపిస్తుంది" అన్నాడు వెంకట్రామయ్య.

విశ్వనాథశాస్త్రికి ఆ ఊరు వచ్చేటప్పటికి అరవై అయిదేళ్ళుంటాయి. జీవితమంతా పట్నాల్లో గడిపిన ఆయన ఈ ఊరొచ్చి ఎందుకు సెటిలయ్యాడో ఎవరికీ తెలియని రహస్యం. ఆయనొచ్చి పక్కింట్లో అద్దెకు దిగినప్పటి నుంచీ శాస్త్రీ చౌదర్ల మధ్య కోల్డ్ వార్ మొదలయింది. వచ్చి టౌన్లో దిగిన రెండు రోజులకు అకౌంట్ ఓపెన్ చెయ్యటానికి బాంకి కెళ్ళుడు విశ్వనాథశాస్త్రి అప్పుడు కొడుకు చదువుకు కావల్సిన లోను విషయమై మానేజరుతో మాట్లాడుతున్నాడు వెంకట్రామయ్య.

"అకౌంట్ ఓపెన్ చెయ్యటానికి మీ క్లర్కులు ఇంట్రొడక్షనధ కావాలంటున్నారు" అన్నారు విశ్వనాథశాస్త్రి - మానేజరు దగ్గరకొచ్చి కంప్లయింట్ చేస్తూ!

"మరి ఎవరి సంతకమైనా పట్రండి" అన్నాడు మానేజర్.

"నేను ఊరికి కొత్తవాడిని. నాకిక్కడెవరూ తెలీదు. అయినా, డబ్బు నాకివ్వటానికి ఇంట్రడక్షనెందుకూ?" అన్నాడు శాస్త్రి చిరాగ్గా.

"బాంకి రూల్స్ ఒప్పుకోవు. మీరు ఎవరి సంతకమైనా తెస్తేనే మా బాంకిలో మీరు అకౌంట్ ఓపెన్ చెయ్య వీలవుతుంది.

వెంకట్రామయ్య జరుగుతున్న సంభాషణంతా వింటూనే ఉన్నాడు. 'తన్నడగొచ్చుగా? తను అతని ఇంటి పక్కవాడేనాయె' అనుకున్నాడాయన. తన్ను అడుగుతాడేమోనని ఎదురు చూశాడు. ఊహూ. ఆయన అడగలేదు.

"ఇట్సాల్‌రైట్. దెన్ ఐడోంట్ వాంటు ఓపెన్ మై అకౌంట్ ఇన్ యువర్ బాంక్' అని కోపంగా పోబోయాడు విశ్వనాథశాస్త్రి.

"అయెూ అంత కోపమెందుకండీ? ఎక్కడుంటున్నారు మీరు?" అడిగాడు మానేజరు.

విశ్వనాథశాస్త్రి తన అడ్రసు చెప్పాడు.

"మరి చౌదరిగారు కూడా అక్కడే కదా ఉండేది. వీరు తెలీదా మీకు? మీరు వారిని ఇంట్రడ్యూస్ చేస్తారా చౌదరిగారూ?" అనడ 'గాడు బాంకి మానేజరు.

వెంకట్రామయ్య ఏం మాట్లాడకుండా ఆ కార్డ్ మీద సంతకం పెట్టి ఇచ్చాడు. చౌదరి వంక ఉలుకూ పలుకూ లేకుండా ఓ చూపు చూసి వెళ్ళిపోయాడు విశ్వనాథశాస్త్రి. అప్పుడనుకున్నాడు వెంకట్రామయ్య 'ఈ శాస్త్రి- మనిషి సరసుడు కాడు' అని.

ఆ సంగతి మరి కొద్ది రోజుల్లోనే స్పష్టమయింది వెంకట్రామయ్యకు. అది మకర సంక్రాంతి రోజు. ఒంటరి వాడు, ముసలాయన ఏమన్నా చేసు కున్నాడో, లేదోనని పండక్కి చేసిన లడ్లూ, కారప్పూస ఓ పళ్ళెంలో పెట్టి - "మీ అయ్యకివ్వు" అని రాముడికిచ్చి పంపింది పార్వతమ్మ.

ఇంట్లోకెళ్ళిన వాడు గిరుక్కున తిరిగొచ్చాడు రాములు

"అయ్య అడ్డమైన తిండ్లు తిండంట. తిరిగిచ్చెయ్యమన్నాడు" అని ప్లేటు తిరిగిచ్చేశాడు రాములు.



భార్యతో విసిగిపోయిన ఓ భర్త ఆత్మహత్య చేసుకోబోయాడు. ఇంతలో "ఏవండీ ఓ క్షణం ఆగండీ" అంటూ వచ్చింది భార్య.

"ఏం! చావయినా ప్రశాంతంగా చావ నియ్యవా?" అని అడిగాడు ఆ భర్త.

"అది కాదండీ నిన్న మీరు తెచ్చిన జీతం ఏ పాంట్‌లో పెట్టారు - జేబులన్నీ వెతికాను.

పార్వతమ్మ ప్లేటు తిరిగి తీసుకొచ్చిన దానికంటే, ఆయనన్న మాటకు ఎక్కువ బాధపడ్డది.

"నేన్చెప్పలా మనిషి వట్టి పేడని! ఇంక వాడికేం పంపకు. తింటే వాడి కులం పోతుంది' అన్నారు వెంకట్రామయ్య భార్యతో.

అలా మొదలైంది వెంకట్రామయ్య శాస్త్రిని 'వాడు-వీడు' అనటం.

అలా వాళ్ళ మధ్య సాగిన కోల్డ్‌వార్ మళ్ళీ వాళ్ళ జీవిత కాలంలో సమసిపోలేదు. వెంకట్రామయ్య కొడుకు మధు చదువు పూర్తయింది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఓ రోజు మధు తండ్రితో అన్నాడు.

"నాన్నా! డాసన్ ఆటో మొబైల్స్‌లో మెకానికల్ ఇంజనీర్ ఉద్యోగాలకి పడ్డాయి. అప్లయి చేశాను. మన పక్కింటాయన దాంట్లో జనరల్ మానేజర్‌గా చేసి రిటైరయ్యాడు కదా! అక్కడ ఆయనకు తెలిసిన వాళ్ళుండొచ్చు. ఆయన ఏమైనా హెల్ప్ చేయగలడేమో అడుగుదామా నాన్నా?" అని. "వాడా! వాడి వల్లేం లాభం లేదురా! కట్టెన్నా కంపనా కాలడు మనిషి" అన్నాడాయన.

"అయ్యో! ప్రయత్నించి చూడరాదూ! అడక్కపోతే అమ్మయినా పెట్టదు. ఆయన ఏమంటాడో ముందు కనుక్కోండి" అంది పార్వతమ్మ.

భార్య మాట కాదనలేక, ఒకవేళ ఆయన సాయం చేస్తే కొడుక్కి వచ్చే ఉద్యోగం తన ప్రయత్న లోపం వల్ల ఆగిపోతుందేమోనని, ఆ,క దగ్గరకు వెళ్ళి అర్థించటానికి ఇష్టం లేకపోయినా, వెంకట్రామయ్య మధును వెంటబెట్టుకుని విశ్వనాథశాస్త్రి ఇంటి కెళ్ళాడు.

అప్పుడాయన సాయంత్రం షికారుకెళ్ళ బోతున్నాడు. వచ్చిన మనుషుల్ని చూస్తున్నాడే కాని పలకరించడు, కూచోమనడు. చివరకు వెంకట్రామయ్యే తప్పక చొరవ తీసుకుంటూ అన్నాడు - "నేను వెంకట్రామయ్య చౌదర్ని. తాసీల్దారుగా పని చేసి రిటైరయ్యాను. మీ పక్కల్లే మాది. వీడు మా అబ్బాయి" అని తను పరిచయం చేసుకుంటూ, 'చౌదరి' అన్న మాటను స్పష్టంగా, నొక్కి పలుకుతూ, 'నీ కిష్టముంటేనే సాయం చేయి, బలవంతమేమీ లేదు' అన్న అర్థముంది ఆ 'చౌదరి' అన్న మాటలో, పలికిన తీరులో.

"మీరు తెల్సు నాకు. కూర్చోండి" అన్నాడు విశ్వనాథశాస్త్రి.

కుర్చీలో కూర్చున్నాక, ఇబ్బందిగా కదులుతూ అడగాలి కాబట్టి మొక్కుబడి తీర్చుకున్నట్టు అన్నాడు వెంకట్రామయ్య. "మీ సాయం అర్థించటానికి వచ్చాం. అబ్బాయి బి.ఇ.మెకానికల్ పాసయ్యాడు. మీరు పని చేసిన డాసన్ ఆటోమొబైల్స్‌లో ఇంజనీరు పోస్టులకు అడ్వర్టైజు చేశార్ట. మీరేమయినా మీకు చేతనయిన సాయం చెయ్యగలరేమోనని వచ్చాం' అని చెప్పేసి చేతులు దులుపుకున్నాడు.

విశ్వనాథశాస్త్రి ఓ క్షణం ఏం మాట్లాడలేదు. తరువాత మధుని అతని సబ్జెక్ట్ మీద ఏవో ప్రశ్నలు వేయసాగాడు. ఆయన ప్రశ్నలు వేసే పద్ధతి చూస్తే అదే ఇంటర్వ్యూలా ఉంది. ఒకటి రెండు ప్రశ్నలేసి మర్యాదకైనా తనే ఊర్కొంటాడులే అనుకున్నాడు వెంక

ట్రామయ్య. ఊహూ! 'ఆ మనిషి కనీసం మర్యాదంటే ఏమిటో తెలిసినట్టు లేదు. ఆ ఇంటర్వ్యూ అరగంటసేపు జరిగింది. ఈ మధ్యలో ఒక్కమాట కూడా వెంకట్రామయ్యతో మాట్లాడలేదు విశ్వనాథశాస్త్రి.

అంతా అయింతరువాత - "బాగా చదూకున్నావయ్యా! ప్రతిభ ఉన్నవాడివి. పైకి వస్తావు. నీలా సామర్థ్యం, ప్రతిభా ఉన్న వాళ్ళు కూడా సిఫార్సులకు వెంపర్లాడితే ఎట్లా? నాకలాంటివి ఇష్టముండవు. ఏనీహౌ ఐ విష్యూ ఆల్ సక్సెస్ ఇన్ యువర్ అటెంప్ట్" అని ఇంక మాట్లాడాల్సిందేం లేనట్టు లేచాడాయన

నిర్ఘాంతపోయాడు వెంకట్రామయ్య. చేసేది లేక వెంకట్రామయ్య, మధూ లేచి ఆయనతోపాటు బయటకు రాక తప్పలేదు.

వెంకట్రామయ్యకు అర్థమైపోయింది. ఆయన తీరు. శాస్త్రికి సిఫార్సు చేయటం ఇష్టం లేదు. కుల ద్వేషం కాక మరేముంటుంది? పైగా తనే అన్నాడు. ప్రతిభ ఉన్న కుర్రవాడివని. పైకి మాత్రం తన కిలాంటివి ఇష్టంలేదని ఫోజులు. ఎవరికి తెలీని సంగతి? చిత్రంగా వెంకట్రామయ్యకు ఆయన సిఫార్సు చేస్తానని అననందుకు కోపం రాలేదు. ఏదో పెద్ద సాయం చేయబోయే మనిషిలా కుర్రవాణ్ణి అంతసేపు ఇంటర్వ్యూ చేయటం ఆయనకక్కోసం కలిగించింది. నిజానికి వెంకట్రామయ్య ఇలాంటివి ప్రోత్సహించరు. ఎవరైనా ఇలా తన దగ్గరకు సిఫార్సు కోసం వస్తే చీవాట్లేసి పంపేస్తారు. ఏ మాత్రం సాయం చెయ్యరు. కొడుకు విషయంలో, తనకు సమ్మతం కాని పని చేసిన గ్లాని కలిగిందాయనకు. దాన్ని కప్పిపుచ్చుకోటానికి ఇంటికొచ్చి భార్యమీద ఇంతెత్తున ఎగిరారు వెంకట్రామయ్య.

"నీకు తెలీదే వాళ్ళ సంగతి? ఈ దౌర్భాగ్యపు జాతి అంతే! వాడేదో ఉద్యోగమిచ్చేట్టు గంటసేపు ఇంటర్వ్యూ చేశాడు పిల్లాడిని. తప్పేడు కొడుకు! సిఫార్సులు చెయ్యటం ఇష్టం లేదట."

"పోన్లే నాన్నా! మనం ప్రయత్నించాం. ఆయన దగ్గరకు వెళ్ళినందుకు మనం సిగ్గుపడాల్సిందేం లేదు. వట్టి ప్రతిభను మాత్రమే చూసి ఉద్యోగాలిచ్చే కాలం కాదు గనుక వెళ్ళి అడిగాం. ఆయన కాదన్నారు అంతే. దానికి కులాన్నీ, జాతినీ తప్పు పట్టాల్సిన పని లేదు" అన్నాడు కొడుకు మధు.

అయితే శాస్త్రి సాయం చేయకపోయినంత మాత్రాన మధుకు డాసక్ ఆటోమొబైల్స్‌లో ఉద్యోగం రాకుండా పోలేదు. ఇంటర్వ్యూకి వెళ్ళాడు. నెల రోజుల్లో అతనికి పోస్టింగ్ ఆర్డర్స్ వచ్చాయి. ఉద్యోగం కలకత్తాలోనే. అప్పుడు



"ఆఫీసులో ఎవరు నిద్రపోయినా నాకు చెప్పమన్నానా! మధ్యాహ్నం సుబ్రమణ్యం నిద్దరోయాడటగా చెప్పలేదేం?" కస్సుమన్నాడు ఆఫీసర్ బాలగోపాలం ప్యూన్ నూకరాజుమీద.

"చెబుదామని వచ్చేసరికి మీరుకూడా మాంచి నిద్రలో ఉన్నారు సార్".

వెళ్ళి వెంకట్రామయ్యకు - "బోడి నువ్వు సాయం చేసేదేందయ్యా! నా కొడుకు స్వయం ప్రతిభతో ఉద్యోగం సంపాయించాడు" అని. అయినా తమాయించుకుని ఊర్కొన్నాడు. మధు ఉద్యోగంలో చేరటానికి కలకత్తా వెళ్ళాడు.

అలా రాజుకొంది ఇద్దరి పక్కింటి వాళ్ళ మధ్య వైరం. వెంకట్రామయ్యకీ మధ్య ఒంట్లో బావుండటం లేదు. డాక్టరు పరీక్ష చేసి డయాబిటీస్ అని తేల్చాడు. "ఊళ్ళో యోగ శిక్షణాలయం ఉంది. వాళ్ళు ఆసనాలు నేర్పి ఇలాంటి రోగాలు మందులు లేకుండా కంట్రోలు చేస్తున్నారు. మీరూ దాంట్లో జేరండి'' అని సలహా ఇచ్చాడు ఆయన.

"ఈ వయస్సులో యోగాసనాలా డాక్టరు గారూ? అన్నాడు సందేహిస్తూ వెంకట్రామయ్య.

"యోగానికి వయస్సుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా వెయ్యవచ్చు" అన్నాడాయన.

వెంకట్రామయ్యగారు యోగ శిక్షణాలయంలో చేరాడు. అక్కడి డాక్టరు వచ్చిన రోగిని పరీక్ష చేసి, ఆ మనిషి ఎలాంటి యోగాసనాలు వెయ్యాలో ప్రిస్క్రైబ్ చేస్తాడు. యోగా ఇన్‌స్ట్రక్టర్ ఆ ఆసనాలు నేర్పుతాడు. రోజూ శిక్షణాలయానికి వచ్చి, వాళ్ళు చెప్పిన ఆసనాలు వేస్తూ ఉండాలి. పదిహేను రోజులకోసారి రక్త, మూత్ర పరీక్షలు చేసి వాళ్ళకు తగిన సలహాలు ఇస్తూంటారు.

యోగ శిక్షణాలయంలో పెద్ద హాలుంది. అక్కడ అంతా జంపకానాలు పరచి ఉంటాయి. గోడకు వంకీలుంటాయి. వెళ్ళిన వ్యక్తి గుడ్డలన్నీ విప్పేసి, వట్టి డ్రాయరుతో ఓ జంపకానమీద

వాళ్ళు చెప్పిన ఆసనాలు వేయాలి. రోజూ పొద్దున్నే వెళ్ళసాగాడు వెంకట్రామయ్య. కొంతవరకు ఆయన ఆరోగ్యం కుదుట పడ్డది.

విశ్వనాథశాస్త్రి వచ్చి ఆ ఊళ్ళో సెటిలయిన మూడేళ్ళకు ఆ రెండు కుటుంబాల మధ్య సఖ్యం ఏర్పడే సంఘటన ఒకటి జరిగింది. ఓ రోజు సాయంత్రం షికారుకు వెళ్ళిన విశ్వనాథ శాస్త్రి ఇంటికి తిరిగి వస్తూ స్పృహతప్పి రోడ్డు మీద పడిపోయాడు. కాలేజి నుంచి వస్తున్న వెంకట్రామయ్య, కూతురు శకుంతల, ఆయన పడిపోవటం చూసి ఓ రిక్షాలో సుధాకర్‌రెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్ళింది. సుధాకర్‌రెడ్డి ఇల్లు వాళ్ళుండే వీధిలోనే. అతను క్రితం ఏడే డాక్టరీ పాసయి, మెయిన్ రోడ్డు మీద ఓ చిన్న నర్సింగ్ హోం తెరిచాడు. అతను శాస్త్రిని పరీక్ష చేసి, ఆయనకు బి.పీ.చాలా ఎక్కువగా ఉందని, ఆసుపత్రిలో చేర్చుకుని ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు.

ఆసుపత్రిలో వారం రోజులున్నాడు విశ్వనాథశాస్త్రి. రోజూ వెళ్ళి ఆయన్ని పరామర్శించి వస్తూండేది శకుంతల.

"పాపిష్టి ముండాకొడుకు! వాడి కేం ఫరవాలేదు. పాపీ చిరాయువని చాలా కాలం బతుకుతాడు. నువ్వెళ్ళి వాడిని పరామర్శించ నక్కరలేదు" అన్నారు ఆయన కూతురితో.

"పోన్లేండి ఎవరి పాపం వాళ్ళది. ఒంటరి మనిషాయన. పక్కనున్న వాళ్ళం. మనకు చేతనైన సాయం చేయకపోతే ఎలా?" అంది పార్వతమ్మ. "మరి ఆ బుద్ధి వాడి కుందా? చెయ్యండి సాయం. చెయ్యండి, ఎవడొద్దన్నాడు? రోజూ తిండి కూడా పట్టుకెళ్ళకపోయావూ?"

"వాళ్ళ రాములు హోటల్నుండి భోజనం తీసుకెళ్తున్నాడులే నాన్నా!" అంది శకుంతల.

"ఆ భ్రష్టుడికి హోటల్ భోజనం పనికి వస్తుంది కాని, మనం పెడితే పనికి రాదు. కులం పోతుంది వెధవకు!

బీ.పీ.వాళ్ళకు ఆహారంలో ఉప్పుండ కూడదట. హోటలు వాడికేం పట్టె? చక్కగా ఉప్పేసి వంట చేస్తాడు; వాడు టపా కట్టటం ఖాయం. ఇంటి కొచ్చింతరువాతయినా ఉప్పు లేకుండా తిని ఛావమను" అన్నాడు వెంకట్రామయ్య కూతురితో.

"అది సరే, మీరూ ఓసారి వెళ్ళి ఆయన్ని చూసి రాకపోయారా? ఎంతయినా పొరుగింటి మనిషి కదా బావుండదు" అంది పార్వతమ్మ.

"థూత్! నేనా వాణ్ణి చూసేది? తప్పేడు కొడుకు! ఏ జన్మలో చేసున్న పుణ్యమో ఉంది బతికిపోయాడు కాని, వాడీ జన్మలో చేసుకున్న దానికి వాడికంతకంటే సక్రమమైన చావు

రాసిపెట్టిలేదు."

"నరేలెండి, మనమూ ముసలాళ్ళ మయ్యాం. మనకెలా రాసిపెట్టి ఉందో, ఎందుక లాంటి మాటలు మాట్లాడతారు? అంది పార్వతమ్మ.

రెండు రోజులుగా పరీక్షల హడావుడిలో ఉండి శకుంతల ఆసుపత్రి కెళ్ళలేదు. విశ్వనాథశాస్త్రి ఎలా ఉన్నాడో తెలియలేదు వెంకట్రామయ్యకు. కూతుర్ని ఆసుపత్రికెళ్ళమని చెబ్దామనుకుని అభిమానం అడ్డొచ్చి చెప్పలేదు. ఉండబట్టలేక ఆసుపత్రి దాకా వెళ్ళాడు. కానీ లోపలికెళ్ళటానికి మనస్కరించక తిరిగి వచ్చేశాడు.

మర్నాడు కూతురొచ్చి-"చిన్నాయన్ని ఇవాళ డిశ్చార్జ్ చేస్తున్నారు నాన్నా! రోజూమందులు వాడాలన్నాడు సుధాకర్. జాగ్రత్తగా ఉండాలంట"అని వచ్చి కూతురు చెప్పిందాకా ఆయన మనస్థిమితం చిక్కలేదు.

"ఓహో! వాడు నీకు చిన్నాయన అయ్యాడన్న మాట. అక్కడికెళ్ళవద్దే అంటే నా మాట ఖాతరు లేదు నీకు" అన్నాడు వెంకట్రామయ్య నిష్ఠురంగా.

"కులాల్ని కాక మనుషుల్ని చూడటం ప్రారంభించి నప్పుడు బాగుపడుతుంది మన జాతి. ఆయనంటే నీకెందుకంత కోపం నాన్నా!' అంది శకుంతల.

"నాకెందుకూ కోపం? వాడి చావు వాడిని చావనీ,యోగ శిక్షణాలయంలో చేరమను. బీ.పీ.మందుల్లేకుండా తగ్గిస్తున్నారు వాళ్ళు" అన్నాడు వెంకట్రామయ్య.

విశ్వనాథశాస్త్రికి జబ్బు చేసినప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యా లేర్పడ్డాయి. వారధి శకుంతల. విశ్వనాథశాస్త్రి, వెంకట్రామయ్యా ఎప్పటిలాగానే ఎడమొహం, పెడమొహంగానే ఉన్నారు. శకుంతల శాస్త్రి ఇంటికి వెళ్తూ ఉండేది. ఇద్దరూ చదరంగం ఆడుకునే వాళ్ళు. కబుర్లు చెప్పుకొనేవాళ్ళు. ఆమెతో పరిచయమైనప్పటి నుంచీ శాస్త్రి ముఖంలో నవ్వు కనిపించసాగింది. ఇదివరకులా ముఖంముడుచుకుని ఉండటం లేదు.

ఇంటికొచ్చిన వారం రోజులకు యోగ శిక్షణాలయంలో కనిపించాడు విశ్వనాథశాస్త్రి వెంకట్రామయ్యకు. శాస్త్రీ వెంకట్రామయ్యను చూశాడు. కానీ పలుకరించలేదు. వెంకట్రామయ్య అసలు శాస్త్రి ఉనికినే గమనించ నట్లు ప్రవర్తించాడు.

వెంకట్రామయ్య రోజూ ఆరింటికి యోగ శిక్షణాలయానికి వచ్చేవాడు. ప్రత్యేకంగా ఓ మూలనున్న జంపకాన నెంచుకుని, దానిమీద యోగాసనాలు వేసేవాడు ఆయన. అది ఎవరైనా ఏరోజయినా ఆక్రమిస్తే ఆయనకు కోపం వచ్చేది. ఏం అనలేక ఊరుకొనేవాడు.

విశ్వనాథశాస్త్రికి కూడా ఆ మూలనున్న స్థానమే నచ్చింది. వెంకట్రామయ్య రావటం ఆలస్య మయితే తనే ముందు ఆ స్థానాన్ని ఆక్రమించు కోసాగాడు. తరవాతొచ్చిన వెంకట్రామయ్య ఏం అనలేక, శాస్త్రి పక్కన ఖాళీ జంపకానాలున్నా వాటిని పట్టించుకోక, ఆ వరుసలో చివరి జంపకానా నాశ్రయించేవాడు.

ఇలా ఆస్థానం కోసం ఇద్దరిలో మౌనంగా పోటీ ప్రారంభమైంది. ఒకళ్ళకంటే ఒకళ్ళు ముందు రావాలని ప్రయత్నించేవాళ్ళు. అయితే యోగ శిక్షణాలయం పొద్దున అయిదున్నర కంటే ముందు తెరువరు కాబట్టి, రోజూ మూలజంపఖానా స్థలం ఎవరికో ఒకరికి మాత్రమే దొరికేది. మరోమూల రెండో వ్యక్తి ఉండాల్సి వచ్చేది. వెంకట్రామయ్య శాస్త్రి ప్రవర్తన చూసి కోపం తెచ్చుకోవటంలో సబబు లేకపోలేదు. తను సూచన ఇస్తే అక్కడ చేరిన మనిషికి కనీస కృతజ్ఞత ఉండక్కర్లా? పైగా తన కిష్టమైన జాగా నాక్రమిస్తాడా?




ఇద్దరూ రోజూ నాగా లేకుండా యోగా శిక్షణా లయానికి వచ్చేవాళ్ళు. ఇద్దర్లో ఎవరికీ ఓ రోజయినా మానేయాలని ఉండేది కాదు. రెండో వ్యక్తి తనకంటే ఆరోగ్యవంతుడవుతాడేమోనన్న పోటీ ఉండేది. ఇద్దరిలో ఇద్దరూ ఒక చోటినుండే అక్కడికు వచ్చే వాళ్ళయినా కలసి మాత్రం ఛస్తే వచ్చేవాళ్ళుకాదు. పొరపాటున ఇద్దరూ ఒకే సమయానికి ఇంటిదగ్గర బయలుదేరినా, ఇద్దరూ రోడ్డున చెరో పక్కా నడిచేవాళ్ళు, కానీ ఒకళ్ళనొకళ్ళు పలకరించుకునే వాళ్ళు కాదు.

వెంకట్రామయ్య కూతురికి సంబంధాలు చూస్తున్నారు. ఓ సంబంధం చాలావరకు సెటిలయి నట్టే. రెండు లక్షలు కట్నమడుగు తున్నారు వాళ్ళు. ఇల్లు అమ్మేస్తే కాని పెళ్ళి చేయలేడు ఆయన. అందుకని ఇల్లు, బేరానికి పెట్టాడు. కూతురి పెళ్ళిచేసి తనూ, భార్యా కొడుకు దగ్గరకు కలకత్తా వెళ్ళాలని ఆయన ఆలోచన. పూర్వులు కట్టిన ఇల్లు అమ్మటం ఆయనకిష్టం లేదు. అయినా తప్పటం లేదు.

కానీ శకుంతల ఆలోచనలు వేరే ఉన్నాయి. సుధాకర్రెడ్డీ, ఆమె ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకోవాలను కుంటున్నారు.

విశ్వనాథశాస్త్రితో చర్చించింది ఆమె. ఆయన ఆమెకు ధైర్యం చెప్పాడు.

"ఇష్టం లేని పెళ్ళి చేసుకోవటమెందుకూ? నీ కిష్టమైన వాణ్ణే చేసుకో, సుధాకర్ పిల్లవాడు మంచి వాడే. అటు మీ నాయనకూ ఇల్లు అమ్మాల్సిన అవసరం ఉండదు" అన్నాడు ఆయన.

అయితే తల్లిదండ్రులకీ విషయం ఎలా చెప్పాలో తోచనేలేదు ఆమెకు. అక్కడికీ తండ్రికి చెప్పింది. "ఇల్లమ్మి అంత కట్నం పోసి నా పెళ్ళి చేయకపోతేనేం నాన్నా! కట్నం తీసుకునేవాడిని నేనసలు చేసుకోను. చిన్నాయనా అదే మాటన్నాడు" అని.

"నీ ముఖంలే, నువ్వు నోర్మూసుకో, మీ చిన్నాయనకు చెప్పు నా విషయాల్లో కలగజేసుకో వద్దని" అన్నాడు వెంకట్రామయ్య.

అలా కాదని ఓ రోజున శకుంతల తానా పెళ్ళి కొడుకును చేసుకోనని తెగేసి చెప్పింది తల్లికి.

"అదేమే?" అంది తల్లి ఎలాకయి.

"నేనూ సుధాకరూ పెళ్ళి చేసుకుంటాం. తనంటే నాకిష్టం" అంది ఆమె.

దాంతో పెద్ద గొలయింది. సుధాకర్రెడ్డి కుటుంబం పరిచయమే వెంకట్రామయ్యకు. వాళ్ళు మంచివాళ్ళే. కాని కులాంతర వివాహమా? వెంకట్రామయ్య ససేమిరా వీల్లేదన్నాడు. కూతుర్ని కాళ్ళూ, చేతులూ విరగ్గొట్టి ఇంట్లో కూచ్చోబెడతా నన్నాడు. సుధాకర్రెడ్డి

తల్లిదండ్రులకూ ఈ పెళ్ళి ఇష్టం లేదు. ఏదో పిల్లలు, చిన్నప్పటినుంచి తెలిసిన వాళ్ళు కలిసిమెలిసి తిరుగుతున్నారనే అనుకున్నారు కానీ, ఇలా ప్రమాదం తెస్తారని వాళ్ళనుకోలేదు.

వెంకట్రామయ్య కూతురును ఇంట్లోనుంచి బయటకు రాకుండా కట్టడి చేశాడు. అయితే ఆ పిల్ల తండ్రిని మోసం చేసింది. నెల రోజులు తండ్రి చెప్పినట్టుగా బుద్ధిగా ఇంట్లోనే ఉంది. నిర్బంధం కొంచెం సడలగానే ఓసారి ఇంట్లో నుంచి వెళ్ళిపోయి, రిజిస్ట్రారు ఆఫీసులో, సుధాకర్ని పెళ్ళి చేసుకుని, తల్లీదండ్రీ ఆశీర్వాదం తీసుకోవాలని వస్తే వెంకట్రామయ్య నిర్ఘాంతపోయాడు. కూతుర్నీ అల్లుణ్ణి నానా తిట్లూ తిట్టాడు.

"ఛీ, నీ మొహం నాకు చూపించకు! నువ్వు నాకు పుట్టలేదనుకుంటాను" అన్నాడు.

"అలాగే వెళ్తాంలే నాన్నా! ఆయన తల్లీదండ్రీ కూడా అలాగే అన్నారు. చిన్నాయన మీ ఆశీర్వాదం తీసుకోమంటే వచ్చాం కానీ, లేకపోతే వచ్చేవాళ్ళం కాదు" అంది శకుంతల రోషంగా, భర్తతో విశ్వనాథ శాస్త్రి ఇంటివైపు వెళుతూ.

ఆరోజు సాయంత్రమే వాళ్ళు హనీమూన్‌కి ఊటీ వెళ్ళిపోయారు. వాళ్ళ పెళ్ళికి సాక్షి సంతకం చేసిన వాళ్ళలో విశ్వనాథశాస్త్రి ఒకరని తెలిసి వెంకట్రామయ్య అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు.

"అంటే వాడికి అంతా తెలుసన్నమాట. నాకు చెప్పకుండా దొంగతనంగా నా కూతురికి పెళ్ళి చేస్తాడా? ఓర్నీయమ్మ కడుపు కాల, నేను నాశనమయితే నీకేం ఒరిగిందిరా తప్పుడుకొడక!' అని తిట్టిపోశాడు.

అంతటితో ఊర్కోలేదు. ఓరోజు శాస్త్రి ఇంటికి వెళ్ళి అతనితో తగువు వేసుకున్నాడు.

"నా కూతుర్ని నాకు కాకుండా చేస్తావా? తెలిసినవాడివి నాకు చెప్పక్కర్లేదా? నీకేం ద్రోహం చేశానని నాకింత అన్యాయం చేశావు? నీ ప్రోత్సాహం లేకపోతే వాళ్ళ కింత ధైర్యం మొస్తుందా?" అని నిలదీశారు వెంకట్రామయ్య శాస్త్రిని.

"బావుంది. మధ్యలో నన్ను తప్పుపడ్తావేం? నీ కూతురు నీ కూతురే. నువ్వే అక్కర్లేదనుకుంటున్నావు. తన కిష్టమున్నవాడిని పెళ్ళి చేసుకుంది. ఇందులో ఇంత బాధపడాల్సిన అవసరమేంలేదు" అన్నాడు శాస్త్రి.

"నీ కూతురూ ఇట్టా చేస్తే నీకు తెలిసొచ్చేది. పరాయి వాళ్ళ పిల్లల్ని ప్రోత్సహించడం కాదు.

"నా కూతురూ ఇలాగే చేసింది. నిజమే, నాకూ ఇష్టం లేదు. ఇండియాలో ఉన్నంతకాలం దాని మొహం చూడలేదు. ఇప్పుడు అమెరికాలో ఉంది. అది చూడాలన్నా కుదరదు. అది ఉత్తరం రాసినా జవాబు రాయను. అది ఎంత బాధ!



'మనం ఇలా ఎన్నాళ్ళు ప్రేమించుకోవాలి గిరి' అడిగింది ఉష.

అతని గడ్డాన్ని వేలితో రాస్తూ

'నీ పెళ్ళో నా పెళ్ళో అయ్యేంతవరకూ' ఆ వ్రేలిని మృదువుగా అందుకొని దానితో ఆడుకొంటూ అన్నాడు గిరి.

అనుభవించిన వాడికే తెలుస్తుందది. నువ్వలా బాధపడకూడదనే నా ఆరాటం. నేను చేసిన తప్పుడు పని నువ్వు చెయ్యొద్దు."

"చేసింది చాలక ఇంకా సలహాలు కూడానా? నోర్మూసుకోవయ్యా, ఏ మాత్రం సిగ్గున్న మనిషివేనా" అని వచ్చేశాడు వెంకట్రామయ్య.

ఇహ ఆ తరువాత వెంకట్రామయ్య శాస్త్రిని బద్ధవైరిగా పరిగణించసాగాడు. సుధాకర్‌రెడ్డికి హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. నర్సింగ్ హోమ్ మూసేసి, భార్యను వెంట బెట్టుకుని హైదరాబాదు వెళ్ళిపోయాడతను - ఎప్పుడైనా ఊరు వస్తే వాళ్ళు శాస్త్రి ఇంట్లో దిగటమే కానీ, తమ పుట్టిళ్ళకు వెళ్ళటానికి వీలులేదు. సుధాకర్‌రెడ్డి తల్లీ తండ్రీ కొంతవరకు సర్దుకున్నారుగానీ, వెంకట్రామయ్య మాత్రం భీష్మించుకు కూర్చున్నాడు.

కూతురికి, అయిన కులంలో పెళ్ళి చేయలేదన్న బాధ తప్ప, వెంకట్రామయ్య పని ఇప్పుడు హాయిగా ఉంది. కూతురి పెళ్ళికి కట్నంగా ఇల్లు అమ్మాల్సిన అవసరం కలగలేదు. సొంత ఇల్లు, వచ్చే పెన్షన్‌తో జీవితం హాయిగా గడచి పోతోంది. కొడుకు దగ్గరకు వెళ్ళి ఉండాల్సిన అవసరం లేదు. కొడుకు పెళ్ళి చేయాలని చూస్తున్నాడు ఆయన. ఏమైనా శాస్త్రి అంటే ద్వేషం పోలేదు వెంకట్రామయ్యకు. వీలైతే గొంతు పిసికి చంపేద్దామన్నంత కోపం ఉంది ఆయనలో.

కాలగర్భంలో మరో మూడేళ్ళు కలసిపోయాయి. రోజూ యోగ శిక్షణాలయానికి వెళ్ళి వస్తూనే ఉన్నాడు వెంకట్రామయ్య. శాస్త్రి కనిపిస్తే మాత్రం ఆయన వంక కొరకొర చూపులు చూడటం మానలేదు. అయితే ఇద్దరికీ ఎంత సన్నిహిత సంబంధమేర్పడ్డదంటే రోజు కొకసారయినా ఒకళ్ళ నొకళ్ళు చూసుకోకపోతే వాళ్ళకా రోజు హాయిగా ఉండదు. ఎప్పుడైనా శాస్త్రి కనిపించకపోతే అనుకునేవాడు వెంకట్రామయ్య - "ఇవాళ రోగిష్టి వెధవ రాలేదెందుకో?" అని.

ఒకోసారి అనిపించేది వెంకట్రామయ్యకు - వాడి బొంద ఎందుకు బతుకుతున్నాడు? వాడి జీవితానికి అర్థమేమిటి? కూతురంటే పడి చావదు. భూమికి భారంగా ఉండేకంటే చస్తే మంచిది వాడు!" అని.

పోను పోను విశ్వనాథశాస్త్రి తనపట్ల చేసిన ద్రోహం మరిచిపోయాడు. 'పోన్లే, దానిష్టమున్న వాడిని అది చేసుకుంది. ఏ కులమైతేనేం?, సుధాకర్ బుద్ధిమంతుడే' అని కూతుర్నీ క్షమించాడు. అయితే ఆమె ఊళ్ళోకి వస్తే పలకరించడు, కన్నెత్తి చూడడు.

శకుంతల ఎప్పుడయినా అత్తింటికొస్తే రెండు రోజులు విశ్వనాథశాస్త్రి ఇంట్లోనే ఉండేది. ఆమె వస్తే పండుగ్గా ఉండేది ఆయనకు. ఆమెను 'అది చేయించి పెట్టాలి, ఇది చేయించి పెట్టాలి' అని హడావుడిగా తిరిగేవాడు. ఆమె కిప్పుడో కొడుకు. వాణ్ణి బజారు తీసుకెళ్ళి ఎన్నో ఆట వస్తువులు కొనిపెట్టేవాడు. మళ్ళీ ఆమె వెళ్ళిపోయిన తరువాత ఉదాసీనంగా మారిపోయేవాడు తను.

వాడి బొంద, వాడికిదేం మాయరోగం? ఇతర్ల పిల్లల్ని చూసి సంతోషించే బదులు, ఆ కూతురు దగ్గరకెళ్ళి ఉండకూడదూ, ఆమె ముసలిముండా వాణ్ణి చూసి ఆనందపడుతుంది కదా!' అనుకునే వాడు వెంకట్రామయ్య.

"ఈ మధ్య, సరిగ్గా విశ్వనాథశాస్త్రి యోగా శిక్షణాలయానికి రావటం లేదు. అతని బీ.పీ.పెద్దగా నయం కాలేదు. మనిషి బాగా బలహీనపడి పోయాడు. వరసగా వారం రోజుగు శాస్త్రి యోగ శిక్షణాలయానికి రాలేదు.

ఏమైందో వెంకట్రామయ్యకంతుపట్టలేదు. ఓసారి రాముల్ని పిలిచి అడుగుదామనుకున్నాడు. భార్య పక్కనుండటంతో వీలుకాలేదు.

'జ్వరం వచ్చిందేమో ముసలి ముండా కొడుక్కి! వాడిని చూసేవాళ్ళెవరున్నారు. దిక్కులేని చావుచస్తాడు. తన్నింత బాధ పెట్టకుండా చస్తే బావుండు పీడాపోతుంది' అనుకునేవాడు.

మరో రెండురోజులు శాస్త్రిని చూడకుండా ఉన్న వెంకట్రామయ్యకు పిచ్చెక్కినట్టయ్యింది. భార్య వంటింట్లో పని చేసుకుంటూందని రూఢి చేసుకుని పక్కింటివేపు తొంగి చూసేవాడు. ఏమీ తెలియలేదు.

మర్నాడు సాయంత్రం శాస్త్రి ఇంట్లోనుంచి డాక్టరు వస్తూంటే, ఆయన్ని కలిసి 'విషయమేమి' టని అడిగాడు వెంకట్రామయ్య ఆదుర్దాగా.

"జ్వరం. హై బీ.పీ. హెమరేజ్‌కూడా వచ్చింది బతకడు. ఇవాళో, రేపో" అన్నాడు ఆయన స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్ళిపోతూ.

వెంకట్రామయ్య అన్యమనస్కంగా

రోడ్డుమీదే నిలబడిపోయాడు.' శాస్త్రి ఇంటికి వెళ్ళాలని ఉంది. వెళ్ళకూడదనే అభిమానమూ ఉంది. ఆయనలా సందిగ్ధ పరిస్థితిలో ఉండగానే రాములు బయట కొచ్చి "అయ్యగారు మిమ్మల్ని పిలుస్తున్నాడు" అని చెప్పాడు.

వెంకట్రామయ్య లోపల కెళ్ళాడు. శాస్త్రి నిస్త్రాణ గా పడున్నాడు.

"ఎలా ఉన్నావు?" అడిగాడు వెంకట్రామయ్య

శాస్త్రికి జవాబిచ్చే ఓపిక లేదు. "అయిపోయింది. వెళ్ళిపోతున్నాను" అని సైగ చేశాడు.

తరువాత దుప్పటి కింద ఏదో కెలుకుతున్నట్టని పిస్తే తనే వెళ్ళి చూశాడు వెంకట్రామయ్య. అక్కడో ఉత్తరం ఉంది. అదితీసి చదివాడు వెంకట్రామయ్య.

ఎవరికీ సంబోధించని ఉత్తరమది.

"నే వెళ్ళిపోతున్నా నా ఇంట్లో వస్తువులూ, కలకత్తాలో ఉన్న నా ఇల్లూ శకుంతలవి. వీలునామా రాసి పెట్టాను. బీరువాలు ఉంది. బాంకిలో ఇరవై లక్షలున్నాయి. ఆ డబ్బుకి నీ పేర చెక్కు రాశాను. డ్రా చెయ్యి. నా కూతురు అమెరికా అడ్రసు ఇస్తున్నాను కింద. ఆ డబ్బు దానికి పంపెయ్యి" అని మాత్రం ఉంది దాంట్లో. దాంతోపాటు తన పేరున ఇరవై లక్షలకో చెక్కుంది.

"సరే" అన్నాడు వెంకట్రామయ్య విశ్వనాథశాస్త్రి వంక చూస్తూ.

శాస్త్రి చేతులు వణుకుతున్నాయి. అలాగే దిండుకింద వెతుకుతున్నాడు. ఎలాగో కష్టంతో దిండు కింద తాళం చెవులు తీశాడు "ఊ" అని మూలిగాడు. "తీసుకో"మని ఆయన ఉద్దేశ్యం. శాస్త్రి అభిప్రాయం గ్రహించిన వెంకట్రామయ్య తాళం చెవులు తీసుకున్నాడు.

వెంకట్రామయ్యకు అక్కడే కూర్చుని శాస్త్రికేమైనా ఓదార్పు మాటలు చెప్పాలని ఉంది. అయితే ఆయన నోటి వెంట మాట రాలేదు. శాస్త్రి వంక చూస్తూ మంచం పక్క బల్లమీద కూర్చున్నాడు. శాస్త్రి కేదో చెప్పాలని ఉంది. చెప్పలేక పోతున్నాడు. యమ బాధపడుతున్నాడు. పక్కకి తిరిగి కళ్ళు తుడుచుకున్నాడు వెంకట్రామయ్య. కొద్దిసేపటిలోనే స్పృహ తప్పిపోయింది శాస్త్రికి.

ఏం చేయ్యాలో తోచలేదు వెంకట్రామయ్యకు. తనమీద ఇంత నమ్మకాన్ని ఉంచిన శాస్త్రి అంటే ఆయనకి కోపంగా ఉంది. 'శాస్త్రి కూతురికి డబ్బు పంపటమేం కష్టంకాదు తనకి. రెండ్రోజుల్లో ఆ డబ్బు పంపే ఏర్పాటు చేస్తాడు తను. కానీ శకుంతలకు ఈ సామానూ, వీలునామా ఎలా పంపాలి? ఎవరికి ఉత్తరవ రాయాలి? కూతురికి తను ఉత్తరం రాయడు. సుధాకర్‌కి రాయాలా? తనకదీ ఇష్టం లేదు. పెద్ద సందిగ్ధ పరిస్థితి తెచ్చిపెట్టాడే దుష్టుడు' అనుకున్నాడు వెంకట్రామయ్య.

మరో ఆలోచన వచ్చింది వెంకట్రామయ్యకు, 'వీడు చూపిన మార్గమే అనుసరిస్తే సరి. ఏవరి పేరూ ఎత్తకుండా పొడి ముక్కలు రాసి పడేస్తే సరి. వచ్చి మీ సామానూ, వీలునామా పట్టుకెళ్ళండి. పంపటం నా వల్ల కాదు అని రాసి పడేస్తాడు తను, వాళ్ళచావు వాళ్ళు చస్తారు.'

అయినా వీడికిదేం పోయేకాలం? ఉన్న ఆస్తిని కూతురికి కాకుండా పరాయి వాళ్ళకి ధారపోస్తున్నాడు. ఆ తండ్రికీ, కూతురికీ ఉన్న సంబంధం సంగతేమిటో తనకు సరిగ్గా తెలీదు. ఆ పిల్ల అక్కడే సెటిలైపోయిందేమో! ఇండియా తిరిగి వచ్చే ప్రశ్నేలేదేమో! అయితే మాత్రం" అయినకాడికి తెగనమ్మి ఆ పిల్లకి డబ్బు పంపిస్తే ఎంత బావుండేది! శకుంతలయినా ఆ పని చేస్తే బావుండు. తను మాత్రం దాని కెలింటి సలహాలూ ఇవ్వదల్చుకోలేదు. తన్ను కాదని వెళ్ళిన వాళ్ళతో తనెలాంటి సంబధమూ పెట్టుకోడు.'

ఆ రోజు రాత్రల్లా అపస్మారకంలోనే పడి ఉన్నాడు విశ్వనాథశాస్త్రి. వెంకట్రామయ్య ఆయన్ని కనిపెట్టుకుని, అలాగే కూర్చుండి పోయాడు. రాత్రి భార్య వచ్చి భోజనానికి రమ్మన్నా వెళ్ళటానికి మనస్కరించలేదు. ఆయనకు అన్నం తినాలని అనిపించలేదు.

తెల్లవారుజాము నెప్పుడో ప్రాణం పోయింది.

'పాపిష్టివాడు పోయాడు. ఒక్కటి, ఒక్కటంటే ఒక్కటి జీవితంలో సవ్యంగా చేసిన ముండాకొడుకు గాదు. వెధవ! వెధవన్నర వెధవ -దిక్కుమాలిన చావు చచ్చాడు' అనుకుంటే వెంకట్రామయ్య కళ్ళంట నీళ్ళు బొటబొటా కారాయి.

శాస్త్రి బంధువు లెవరో వెంకట్రామయ్యకు తెలీదు. ఉన్న ఆ ఒక్క కూతురికీ కేబుల్ పంపినా, ఎప్పుడది అందేను, ఎప్పుడామె వచ్చేను? అందువల్ల తనే నడుం కట్టుకుని అన్ని ఏర్పాట్లూ చేశాడు వెంకట్రామయ్య. తనే తలకొరివి పెట్టాడు.

'నువ్వెవరో నాకు తెలీదు శాస్త్రీ! చివరికి నా చేత కొరివి పెట్టించుకుని పోవాలని రాసి పెట్టాడు కాబోలు ఆ భగవంతుడు. వెళ్ళు మిత్రమా! ఇదే నా చివరి వీడ్కోలు అని గొణుక్కున్నాడు వెంకట్రామయ్య. నిస్త్రాణగా శ్మశానంలో నేలమీద కూలబడి రోదించాడు.

మర్నాడు ఇంట్లో సామాను ఏం ఉందో చూసి శకుంతలకు ఉత్తరం రాయాలని శాస్త్రి ఇంటికి వెళ్ళాడు వెంకట్రామయ్య. టేబుల్ డ్రాయర్‌లో ఏవో ఉత్తరాలు కనిపించాయి ఆయనకు. 'అవేమిటా' అని చూశాడు ఆయన.

అవి పదో పన్నెండో ఉన్నాయి. శాస్త్రి కూతురు అమెరికా నుంచి రాసినవి. ఒక్కొక్క ఉత్తరం శాస్త్రి ఎన్నిసార్లు చదివాడో కానీ అన్నీ జీర్ణావస్థలో ఉన్నాయి. అన్నిటికంటే కింద అసలేమీ నలగని ఉత్తరం ఒకటి ఉంది, 'అదేమిటా'. అని చూశాడు వెంకట్రామయ్య.

అది దాసన్ ఆటోమొబైల్స్ కంపెనీ జనరల్ మానేజర్ ఏళ్ళ క్రితం రాసిన ఉత్తరం. ఉత్తరం ఇంగ్లీషులో ఉన్నా తెలుగులో దాని అర్థమిది.

"శాస్త్రిగారూ! మీ ఉత్తరం అందింది. మన కంపెనీ ఉద్యోగానికి అప్లై చేసిన మధుసూధన్,బి.ఇ. చాలా సమర్థుడనీ, తెలివిగల వాడనీ, పైకి రావటానికి తగిన అర్హతలున్న అభ్యర్థనీ రాశారు. ఇంటర్వ్యూ కూడా చేశానని రాశారు. మీరు స్పష్టంగా ఆ మాట రాకపోయినా, నేను మీరు చేసిన సూచన గ్రహించాను. అతనికి తప్పకుండా ఉద్యోగమిస్తాం. మీరు ఎంపిక చేసిన అభ్యర్థి కంపెనీ అభివృద్ధికి అవసరమనే నా విశ్వాసం." కింద జనరల్ మానేజర్ సంతకముంది.

"ఒరే శాస్త్రీ! ఇంత దుర్మార్గం తగదురా నీకు! నన్నింత మోసం చేస్తావా? ఉండు, నేనూ త్వరలోనే నీ దగ్గరకు వస్తాను. నిన్ను జాడించి ఉతికి ఎండెయ్యకపోతే నా పేరు వెంకట్రామయ్య చౌదరే కాదు! అంటూ అక్కడున్న సోఫాలో చతికిలబడిపోయాడు ఆయన.

*



ఆ పచ్చని మైదానంలో ఉన్న ఒకే ఒక చెట్టు కింద కూచున్నారు రాధాగోపీలు.

"రాధా నీ కళ్ళలో యావత్ ప్రపంచమూ కనిపిస్తోంది" పరవశంగా రాధ ముఖంలో ముఖం పెట్టి అన్నాడు గోపీ.

"బాబ్బాబూ..... నా గొర్రె ఒకటి కనపడ్డం లేదు. అందులో ఎక్కడైనా కనిపిస్తే చెప్పండి" అడిగాడు అక్కడే ఉన్న గొర్రెలకాపరి.